సాక్షి అనకాపల్లి

శనివారం । 11 । అక్టోబర్ । 2025



పుస్తకాల పంపిణీ

పెందుర్తి: బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'ఎదిగే ఆడపిల్ల' పుస్తకాన్ని విద్యార్థినులకు పంపిణీ చేశారు.



సిరులతల్లికి క్షీరాభిషేకం

విశాఖ నగరంలోని బురుజుపేటలో కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం మేఘావృతమై, తేలిక పాటి వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 33.0 నుంచి 33.3 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 25.3 నుంచి 25.8 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

న్యూస్‌రీల్

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

అనకాపల్లి: బాణసంచా తయారీ, విక్రయదారులు నిబంధనలు పాటించాలని ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోటవురట్ల మండలం కై లాస పట్నం, కోనసీమ జిల్లాలో చోటుచేసుకున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల ప్రాణ, ఆస్తి భద్రత కోసం బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా, భద్రతా ప్రమాణాలు పాటించకుండా బాణసంచా తయారీ, నిల్వ చేయడం, విక్రయించడం నేరమని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బాణసంచా గోదాములు, తయారీ, విక్రయ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అనధికారిక బాణసంచ తయారీ, నిల్వ ఉంచడం, విక్రయం జరుగుతున్నట్లు గమనించినట్టయితే స్థానిక పోలీసులకు లేదా 112 నంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

'కళింగ'లో క్షిపణి నాణ్యత పరిశీలన

- అందుబాటులోకి అత్యాధునిక స్టాటిక్ ఫైరింగ్ ఫెసిలిటీ 'త్రినేత్ర'
- భీమిలిలో 'అగ్నివీరు'ల కోసం త్రీడీ బిల్డింగ్ నిర్మాణం



త్రినేత్ర సెంటర్‌ని ప్రారంభిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ పెంధార్కర్

సాక్షి, విశాఖపట్నం : వ్యూహాత్మక నేవల్ బేస్ ఐఎన్‌ఎస్ కళింగ అత్యాధునిక వ్యవస్థలకు కేంద్ర బిందువుగా మారింది. నావల్ వెపన్ సిస్టమ్స్‌ను పరీక్షించడానికి అత్యాధునిక స్టాటిక్ ఫైరింగ్ ఫెసిలిటీ 'త్రినేత్ర'ని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ శుక్రవారం ప్రారంభించారు. నౌకాదళ ఆయుధ సంపత్తి నాణ్యత పరిశీలన, లైఫ్‌టైమ్ చెకింగ్ మొదలైన అంశాల కోసం... ఇప్పటి వరకూ ఫారిన్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఓఈఎం)పైనే భారత నౌకాదళం ఆధారపడేది. ఇకపై భీమిలి కేంద్రంగా ఐఎన్‌ఎస్ కళింగలో ఏర్పాటు చేసిన త్రినేత్ర ద్వారా ఈ పరీక్షలు విజయవంతంగా నిర్వహించనున్నారు. క్షిపణులు, రాకెట్‌లు, ఆయుధాల సామర్థ్యమెలా ఉంది.? ఇంకా వాటి జీవిత కాలం ఎన్ని రోజులు ఉంటుంది.? మొదలైన పరిశీలనలు చేసే అత్యాధునిక సాంకేతికత త్రినేత్రలో ఏర్పాటు చేశారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఇక్కడి పరికరాల్ని తయారు చేసినట్లు తూర్పు నౌకాదళ వర్గాలు పేర్కొన్నాయి.


మనవడు మహా ముదురు

8లో

గోవాడ సుగర్స్‌పై నీలి నీడలు

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మనుగడపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఫ్యాక్టరీని మూసివేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి తాజాగా మహాజనసభను ఆరునెలలు వాయిదా వేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఊతమిస్తున్నాయి. ఫ్యాక్టరీ పుట్టిన దగ్గర నుంచి ఇప్పటి వరకూ ఎప్పుడూ మహాజనసభ జరగకుండా లేదు. ప్రతీ ఏటా క్రషింగ్‌కు ముందు సెప్టెంబరు 30వ తేదీన ఫ్యాక్టరీ మహాజనసభ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది సభ జరిపించాల్సిన తేదీ వెళ్లిపోయినా యాజమాన్యం ఇప్పటి వరకూ మహాజనసభ ఊసే ఎత్తలేదు. దీంతో రైతులు, కార్మికుల్లో భయం నెలకొంది.

- మహాజనసభ 6 నెలలు వాయిదా
- ప్రతి ఏటా సెప్టెంబర్ 30న నిర్వహణ
- ఈ ఏడాది వాయిదా వేయడం వెనుక అంతర్యమేంటి?
- ఆర్థిక సాయం చేయకపోగా మూసివేసే దిశగా ప్రభుత్వం చర్యలు
- ప్రశ్నార్థకంగా 24 వేల మంది రైతులు, కార్మికుల భవితవ్యం
- మహాజనసభ పెట్టకపోతే ఆందోళనకు దిగుతామన్న ఫ్యాక్టరీ పరిరక్షణసమితి



గోవాడలోని చక్కెర కర్మాగారం

చోడవరం:

మహాజనసభ పెట్టాలంటూ గత రెండునెలలుగా రైతులు నిరాటంకంగా ఉద్యమం చేస్తున్నారు. అయినా చెరకు రైతుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోలేదు. గత నెల 30న జరగాల్సిన మహాజన సభ నిర్వహణపై ఇప్పటి వరకూ కనీసం ఒక్క ప్రకటన కూడా చేయలేదు. నిర్వహిస్తారా.. లేదా అనేది ఏమీ చెప్పలేదు. తాజాగా మహాజనసభ నిర్వహణను ఆరునెలల తర్వాత ఆలోచిస్తామంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గడువును యాజమాన్యమే కోరిందంటూ మరో షాక్ ఇచ్చింది. అసలు సభ నిర్వహణపై యాజమాన్యం ఆరునెలల గడువు ఎందుకు కోరింది. ఫ్యాక్టరీని మూసేయాలన్న ఆలోచనతో ప్రభుత్వమే మహాజనసభ నిర్వహించకుండా ఆ నెపాన్ని యాజమాన్యంపై నెట్టేస్తుందా అనే ప్రశ్నలు సర్వత్రా చెరకు రైతుల్లో నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఏడాదిన్నరగా ఫ్యాక్టరీకి ప్రభుత్వం ఒక్క పైసా సాయం చేయలేదు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా రూ.10 కోట్ల నుంచి 20 కోట్ల వరకూ సాయం చేసి ఐదేళ్లలో సుమారు రూ. 89 కోట్లు అందించింది. దీనితో ఫ్యాక్టరీ ఆర్థికంగా నష్టాల్లో ఉన్నా రైతులకు చెరకు పేమెంట్స్, కార్మికులకు జీతాలు ఎక్కడా బకాయి లేకుండా ఐదేళ్ల క్రషింగ్ కూడా సజావుగానే సాగింది. కానీ ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది సుమారు లక్షా 14 వేల టన్నుల క్రషింగ్ చేశారు. ఆ చెరకు సరఫరా చేసిన రైతులకు ఇప్పటి వరకూ పేమెంట్స్ చేయలేదు. అంతేకాదు కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు కూడా ఇవ్వలేదు. రైతులకు కార్మికులకు కలిసి సుమారు రూ. 29 కోట్లు తక్షణం చెల్లించాల్సి ఉంది.

క్రషింగ్ సన్నాహాలు లేవు

ఈ ఏడాది క్రషింగ్ సీజన్ ప్రారంభం కావడానికి రెండునెలలు మాత్రమే గడువు ఉంది. క్రషింగ్‌కు సంబంధించి ఇంకా ఇప్పటి వరకు ఫ్యాక్టరీలో ఎటువంటి ఓవరాయిలింగ్ పనులు చేపట్టలేదు. ఫ్యాక్టరీ ఏరియాలో చెరకు లక్ష టన్నులు కార్పితోట, మరో 20 వేల టన్నుల వరకు ఉడుపు తోటలు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. రైతుల వద్ద ఉన్న ఈ చెరకైనా గానుగాడాలంటే ఫ్యాక్టరీలో మిషనరీకి ఓవరాయిలింగ్ పనులు ఇప్పటికే ప్రారంభించాల్సి ఉంది. అది కూడా చేయలేదు. ఈ ఏడాది క్రషింగ్ జరుగుతుందా లేదా అనే మీమాంసలో ఉన్న అనేక మంది రైతులు క్రషింగ్ ప్రకటన వచ్చిన వెంటనే చెరకు తోటలు వేద్దామని ఎదురుచూస్తున్నారు. అదును మీరిపోయినా ఇప్పటి వరకూ క్రషింగ్‌పై ఎటువంటి ప్రకటన రాలేదు. ప్రభుత్వ ఆర్థికంగా కనీసం రూ. 40 కోట్లు అయినా ఇస్తే తప్ప ఈ ఏడాది క్రషింగ్ చేయలేమని ఇప్పటికే ఫ్యాక్టరీ యాజమాన్యం తేల్చి చెప్పేసింది. అంటే ఇక ప్రభుత్వమే ఫ్యాక్టరీని నడిపించాల్సిందేనని అర్థమైంది. క్షేత్రస్థాయిలో ఉన్న ఈ సమస్యలన్నీ యాజమాన్యానికి, రైతులకు, కార్మికులకు అందరికీ తెలుసు. అయినప్పటికీ మహాజనసభ నిర్వహిస్తే ఫ్యాక్టరీ మనుగడ, చెరకు రైతుల మనుగడపై ఒక నిర్దిష్టమైన అంచనాకు వచ్చి తర్వాత ఏమి చేయాలనే దానిపై చర్చించుకోవచ్చనే ఆలోచనలో రైతులంతా మహాజనసభ నిర్వహించాలని రెండు నెలలుగా ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఏమీ పట్టించుకోలేదు.

మహాజనసభ నిర్వహించకపోతే ఆందోళన

చెరకు రైతుల సమస్యలు పట్టించుకోకుండా వారి బాధలు వినకుండా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పరిరక్షణ సమితి పేర్కొంది. 24 వేల మంది చెరకు రైతులు, 600మంది కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడితే సహించేదిలేదని హెచ్చరించింది. మహాజన సభను వెంటనే నిర్వహించాలని, రైతుల సమస్యలు సభ ద్వారా ప్రభుత్వం వినాలని, ఫ్యాక్టరీ మనుగడపై సభ ద్వారా రైతులకు ప్రభుత్వ నిర్ణయం చెప్పాలని డిమాండ్ చేసింది. వెంటనే మహాజనసభ నిర్వహించాలని, లేనిపక్షంలో ప్రత్యక్షం ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామంటూ స్పష్టం చేసింది.

నాటి 'కూటమి' మాటలేమయ్యాయి?

ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులంతా ఫ్యాక్టరీని ఆదుకుంటాం, ఆధునీకరిస్తాం, చెరకు రైతులకు టన్నుకి రూ.4 వేల గిట్టుబాటు ధర ఇస్తామని అనేక ప్రగల్భాలు పలికారు. వారంతా ఇప్పుడు ఫ్యాక్టరీపై నోరు మెదపడం లేదు. చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అయితే ఏకంగా చెరకు బదులు మొక్కజొన్న వేసుకోండంటూ బహిరంగంగానే చెబుతున్నారు. మహాజనసభ పెట్టి రైతుల సమస్యలు విని ప్రత్యామ్నాయం వైపు నడిపించాల్సిన ప్రభుత్వం ఏకంగా మహాజన సభనే ఆరునెలల పాటు వాయిదా వేస్తున్నట్టు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై అనుమానాలు తలెత్తాయి. కనీసం రూ. 50 కోట్లు ఇచ్చి చెరకు రైతులను, కార్మికులను, సుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ ఏకంగా సభను వాయిదా వేయడం ద్వారా ఫ్యాక్టరీని మూసివేయడానికి సర్వం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆరునెలలు వాయిదా అంటే ఈ క్రషింగ్ సీజన్ పూర్తిగా పోతుంది. అంటే క్రషింగ్ సీజన్ ఉండదన్నది స్పష్టంగా అర్థమౌతోంది. మరి క్షేత్రస్థాయిలో ఫ్యాక్టరీని నమ్ముకొని చెరకు పండించిన 24 వేల మంది రైతులు, కార్మికులు ఏమైపోతారు, వారి మనుగడ ఏంటి అనే ఆలోచన కూడా ప్రభుత్వం చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే నెల 22 నాటికి కోటి సంతకాలు పూర్తి

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్యక్రమాలు
- జగన్ పర్యటన విజయవంతంపై అందరికీ కృతజ్ఞతలు
- ఉత్తరాంధ్ర నేతలతో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు టెలికాన్ఫరెన్స్

సాక్షి, విశాఖపట్నం : నర్సీపట్నంలో వైద్య కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9వ తేదీన చేపట్టిన పర్యటనను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, ప్రజలకు ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ నాయకులతో శుక్రవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణను నర్సీపట్నం నుంచే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. నవంబర్ 22వ తేదీలోపు కోటి సంతకాల సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ నియోజకవర్గంలో 50 నుంచి 60 వేల సంతకాల సేకరణ చేపట్టాలని, ప్రతీ గ్రామంలో 500 సంతకాలు తగ్గకుండా చూడాలని సూచించారు. ఈ నెల 28వ తేదీన ప్రతీ నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం చేపట్టాలన్నారు. సంతకాల సేకరణ ప్రక్రియను నవంబర్ 22వ తేదీకి పూర్తి చేసి 23న ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు ఈ ప్రతులను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపించాలన్నారు. నవంబర్ 26న పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ముఖ్యనేతలు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి వీటిని అందజేస్తారన్నారు. సోషల్ మీడియా వేదికగా ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రచారం చేయాలని.. ఆ బాధ్యత సోషల్ మీడియా యాక్టివిస్టులు తీసుకోవాలని సూచించారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ఉపసంహరించుకునే వరకూ పోరు ఆపకూడదన్నారు.

జిల్లా, మండల, గ్రామ అనుబంధ విభాగాల కమిటీల నియామకం కూడా నవంబర్ 22 నాటికి పూర్తికావాలన్నారు. అలాగే కల్తీ మద్యంపై వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్: బోధనేతర కార్యక్రమాలను శుక్రవారం నుంచి ఉపాధ్యాయులు బహిష్కరించారు. ఈ మేరకు స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావు నాయుడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా జనరల్ సెక్రటరీ ఎస్.చిరంజీవి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడంతో బోధనపై ఆసక్తి తగ్గుతోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ నెల 10 నుంచి బోధన, విద్యార్థుల హాజరు, భోజన పథకానికి సంబంధించిన పనులను మాత్రమే ఉపాధ్యాయులు నిర్వహిస్తారని తెలిపారు. విద్యాశక్తి, జీఎస్టీ 2.0 పనులు లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలు చేపట్టబోరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమలో ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, కె.నరహరి, బి.మనోజ్ కుమార్, చందోలు వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం

- ఆస్పత్రుల్లో అడ్మిషన్లు బంద్
- వెనుదిరిగిన పేద రోగులు

అనకాపల్లి: ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలకు శుక్రవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి రావాల్సిన కోట్ల రూపాయల బకాయిలను కూటమి ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) ఆధ్వర్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలను నిలిపివేశాయి. దీంతో చికిత్స కోసం ఆస్పత్రులకు వెళ్లిన పేద రోగులు ఓపీ సేవలు దొరక్క నిరాశతో వెనుదిరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలను పెండింగ్‌లో పెట్టింది. ఆస్పత్రులకు ఆర్థిక భారం పెరగడంతో 'ఆషా' సేవలు నిలిపివేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఆరోగ్యశ్రీ, ఉద్యోగ ఆరోగ్య పథకం కింద సేవలను నిలిపివేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆదేశాలు జారీ చేసింది.ఈ సేవలు నిలిపివేయడంతో, పేదలు, ప్రభుత్వ ఉద్యోగులు చికిత్స పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేకు పడటంతో జిల్లా నెట్‌వర్క్ ఆస్పత్రులపై నీలి నీడలు కమ్ముకున్నాయి. జిల్లా పరిధిలో ఆరోగ్యశ్రీ కింద 5 ఆస్పత్రులు నెట్‌వర్క్‌లో ఉండగా, మొదటి రోజు అత్యవసర సేవలను మాత్రమే స్వీకరించారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ సేవలను పూర్తిగా నిలిపివేశారు. చికిత్స కోసం వచ్చిన ఎంతో మంది రోగులు నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి నిరాశగా తిరిగి వెళ్లాల్సి వచ్చింది. రోగులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త తెలిపారు. రోగులకు అంతరాయం కలిగితే తమను సంప్రదించాలన్నారు.

ఏయూలో 17న ఎన్‌ఎస్టీఎల్ అకడమిక్ కాన్ఫరెన్స్

మద్దిలపాలెం (విశాఖ): ఆంధ్ర విశ్వవిద్యాలయం నేవల్ సైన్స్ టెక్నాలాజికల్ లేబరేటరీ (ఎన్‌ఎస్టీఎల్) సహకారంతో ఈనెల 17వ తేదీన ఎన్‌ఎస్టీఎల్ అకడమిక్ కాన్ఫరెన్స్– 2025ను నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ తెలిపారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా సదస్సు నిర్వహించనున్నామన్నారు. బ్రోచర్, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌ను ఎన్‌ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం, ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ఆవిష్కరించారు. శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఇటువంటి సాంకేతిక కార్యక్రమం విశ్వవిద్యాలయానికి మరింత ప్రతిష్టను అందిస్తుందని వీసీ చెప్పారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీ ఆర్ రాజు, అకడమిక్ డీన్ ఆచార్య కె. శ్రీనివాసరావు వివిధ విభాగాల ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల వేదన... అరణ్య రోదన

అక్షర జ్ఞానం కోసం ఆ గిరిజన బాలల సాహసకృత్యం కఠిన హృదయాలను సైతం కదిలిస్తుంది. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం, పాఠశాల లేకపోవడంతో సమీప గ్రామాల్లోని బంధువుల ఇళ్లల్లో ఉంటూ చదువుకుంటున్న గిరిజన విద్యార్థుల పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతుంది. బాల్యదశలో వారు తల్లిదండ్రుల ప్రేమానురాగాలకు దూరమవుతున్నారు. దేవరాపల్లి మండలం గరిశింగి పంచాయతీ శివారు కించుమండలోని గిరిజన బాలల దుస్థితి ఇది. ఇంకా అనేక సమస్యలు ఆ గ్రామాన్ని వేధిస్తున్నాయి.

- ఎత్తైన కొండ శిఖరంపై కష్టాల వలయంలో కించుమండ గ్రామం
- చదువు కోసం బంధువుల ఇళ్లల్లో ఈ గ్రామ చిన్నారుల నివాసం
- బడి, రహదారి సౌకర్యం లేక సతమతం
- తల్లిదండ్రుల ప్రేమానురాగాలకు దూరం
- రోగం వస్తే 3 కి.మీ మేర డోలీ మోయాల్సిందే



అనారోగ్యానికి గురైన వ్యక్తిని డోలీలో కిందకు దించుతున్న గిరిజనులు

దేవరాపల్లి:

బాహ్య ప్రపంచానికి దూరంగా ఎత్తైన కొండ శిఖరంపై ఉన్న కించుమండ గ్రామంలో కనీస సదుపాయాలు లేక గిరిజన ప్రజలు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. ఇక్కడి గ్రామానికి చేరుకోవాలంటే దట్టమైన అటవీ ప్రాంతం గుండా పెద్ద పెద్ద బండలు, పొదలు దాటుకుంటూ సుమారు 3 కి.మీ మేర ప్రమాదకర ప్రయాణం చేయాలి. ఎత్తైన ఈ కొండపైకి చేరుకోవడానికి సుమారు 3 గంటల సమయం పడుతుంది. ప్రతి 10 నిముషాలకు విశ్రాంతి తీసుకుంటే తప్ప ముందుకు సాగే పరిస్థితి ఉండదు. మండల కేంద్రం దేవరాపల్లికి సుమారు 12 కి.మీ, పంచాయతీ కేంద్రం గరిశింగికి సుమారు 5.కి.మీ దూరంలో ఈ గ్రామం ఉంది. కించుమండలో సుమారు నాలుగు తరాలుగా ఇక్కడి గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ గ్రామంలో 13 ఇళ్లు ఉండగా 51 మంది గిరిజనులు నివాసం ఉంటున్నారు. వీరిలో 15 మంది విద్యార్థులు ఉన్నారు.

బడి కోసం... కన్నవారికి దూరంగా..

నిరక్షరాస్యులైన తాము కనీసం తమ పిల్లలకైనా అక్షర జ్ఞానం కల్పించి ప్రయోజకులను చేయాలని ఇక్కడి గిరిజనులు తపిస్తూ ఉంటారు. అయితే కొండ శిఖరంపై ఉన్న తమ గ్రామంలో పాఠశాల, రహదారి సౌకర్యం లేకపోవడం వారికి గుదిబండగా మారింది. కొండ దిగువన సమీప గ్రామాల్లో ఉన్న పాఠశాలకు ప్రతి రోజూ వెళ్లి వచ్చే పరిస్థితి లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో దూరపు బంధువుల ఇళ్లల్లో ఉంచి చదివించాలని కఠిన నిర్ణయం తీసుకున్నారు. గ్రామానికి చెందిన చిన్నారులు ఇదే పంచాయతీ పరిధిలోని వేలంబయలు, డొర్రిచెరువు, కొత్తూరు తదితర గ్రామాల్లో బంధువుల ఇళ్లల్లో ఉంటూ చదువుకుంటున్నారు. బంధువులు సైతం ఇబ్బంది పడుతున్నా తప్పని పరిస్థితిల్లో ఏళ్ల తరబడి అక్కడే ఉంచి చదివిస్తున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేగులబంద ప్రాథమిక పాఠశాల్లో ఐదుగురు, గరిశింగి పాఠశాల్లో మరికొంత మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

కనీస సదుపాయాలు కరువు

కించుమండ ప్రజలు కనీస సదుపాయాలు లేక దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. తాగునీరు, విద్యుత్ సదుపాయం ఉన్నప్పటికీ రోడ్డు ఇతర అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఇతరత్ర సదుపాయాలు లేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇటు ప్రజాప్రతినిధులు కాని, అటు అధికారులు గాని గ్రామానికి వచ్చిన పరిస్థితి లేదు. ఆశా కార్యకర్త తప్ప వైద్య సిబ్బంది రాని దుస్థితి. వెరసి వైద్యం అందని ద్రాక్షగా మిగిలింది. ఎవరికి రోగం వచ్చినా డోలీ కట్టి కొండ దిగువకు దించాల్సిన దుస్థితి. అత్యవసరమైతే మంచంపై మరణించాల్సిందే తప్ప వేరే దారి లేదు. వైద్య సేవలందించిన తర్వాత కూడా పూర్తిగా నయం అయ్యే వరకు బంధువుల ఇళ్లల్లో ఉంటున్న దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.



ఎత్తైన కొండపై ఉన్న కించుమండ గ్రామం



బంధువుల ఇళ్ల నుంచి పాఠశాలకు వెళుతున్న కించుమండ విద్యార్థులు



రేగులబంద పాఠశాలలో చదువుకుంటున్న కించుమండ విద్యార్థులు

మా పిల్లలైనా ప్రయోజకులు కావాలి



మా కుమారుడు దావీదు 4వ తరగతి, కుమార్తె నిత్య ఒకటో తరగతి చదువుతున్నారు. యాలంబయలు గ్రామంలోని బంధువుల ఇంటిలో ఉంచి సమీపంలోని రేగులబంద స్కూల్‌లో చదివిస్తున్నాం. మాకు ఎలాగూ చదువు సంధ్య లేదు. మా పిల్లలైనా చదివి ప్రయోజకులు అవ్వాలని కష్టమైనా బంధువుల ఇళ్లల్లో ఉంచాం.

–కంచర గంగరాజు, విద్యార్థి తండ్రి, కించుమండ

గిరిజనులుగా పుట్టడమే పాపమా?



ప్రతి నెలా రేషన్, పింఛన్ కొండ దిగువకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుంది. గర్భవతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరికి అనారోగ్యం వచ్చినా ఎత్తైన కొండ నుంచి డోలీలో కిందకు తేవాలి. గిరిజన ప్రాంతంలో పుట్టడమే శాపంగా మారింది. మేము బతికుండగా గ్రామానికి రోడ్డు నిర్మించాలన్నది మా కోరిక.

–గూట్ల పెంటమ్మ, గిరిజన మహిళ, కించుమండ

పెన్షన్, రేషన్ కోసం ప్రతి నెలా అవస్థలు

ప్రతి నెలా పింఛన్ సొమ్ము కోసం వృద్ధులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పైకి రాకపోవడంతో వృద్ధులు కొండ దిగి దిగువన ఉన్న డొర్రి చెరువు గ్రామానికి వెళ్లి పింఛన్ తీసుకుంటున్నారు. రేషన్ కోసం సుమారు 5 కి.మీ దూరంలో ఉన్న గరిశింగి రేషన్ డిపోకు వెళ్లి తెచ్చుకుంటూ నానా ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కించుమండలో నందల నుయ్యి తవ్వించి, ప్లాస్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేసి మోటారు ద్వారా ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేశారు. 14 మందికి పోడు పట్టాలు అందించారు. రోడ్డు సౌకర్యం కల్పిస్తే వారి కష్టాలు కొంతవరకు తీరుతాయి. చింతలపాలెం వైపు నుంచి రోడ్డు నిర్మాణం కోసం రూ.3.30 కోట్లతో రెండు బిట్లుగా ఎస్టిమేట్ తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని దేవరాపల్లి ఇన్‌చార్జి పీఆర్ ఏఈ ఆర్.సుమతి తెలిపారు. ఫారెస్ట్ క్లియరెన్స్ రావలసి ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో కొన్ని సమస్యల పరిష్కారం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నీటి సమస్యను అధిగమించాం. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో గరిశింగి నుంచి డొర్రి చెరువు గ్రామం వరకు రూ.1.35 కోట్లతో తారురోడ్డు నిర్మించాం. కించుమండ గ్రామానికి సైతం రహదారి నిర్మించేందుకు కృషి చేస్తున్నాం.

–గూడెపు రాము సర్పంచ్, గరిశింగి పంచాయతీ

మనవడు మహా ముదురు

- కంచరపాలెంలో దోపిడీ ఇంటి దొంగ పనే..
- క్రైమ్ థ్రిల్లర్ సినిమాను తలదన్నేలా స్కెచ్ వేసిన కృష్ణకాంత్
- ఇంటి దొంగతో పాటు సహకరించిన ముగ్గురు స్నేహితుల అరెస్ట్
- రూ.2.1 లక్షలు, 12 తులాల బంగారం ఆభరణాలు, కారు స్వాధీనం

విశాఖ సిటీ : క్రైమ్ థ్రిల్లర్ సినిమాను మించిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. కంచరపాలెంలో బామ్మ, మనవడిని కట్టేసి.. బంగారం, నగలు దోచుకున్నది ఇంటి దొంగే అని గుర్తించారు. ఈ దోపిడీలో మాస్టర్ మైండ్ మనవడే అన్నదే ఇక్కడ అసలు ట్విస్ట్. అప్పుల ఊబి నుంచి బయట పడేందుకు థ్రిల్లర్ సినిమాను తలదన్నేలా ముగ్గురి స్నేహితులతో కలిసి సొంతింట్లోనే దోపిడీకి పక్కాగా ప్లాన్ చేసి బంగారు ఆభరణాలు, నగదు దోచేశాడు. సాంకేతికత ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేయగా అసలు విషయాన్ని తెలుసుకుని షాక్‌కు గురయ్యారు. తన సొంత ఇంటికే కన్నం వేసిన కృష్ణకాంత్ (19)తో పాటు అతని ముగ్గురు స్నేహితులు పరపతి ప్రమోద్ కుమార్ (30), షేక్ అభిషేక్ (21), అవసరాల సత్యసూర్యకుమార్ (24)లను అరెస్టు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం..

జీవీఎంసీలో కాంట్రాక్టు పనులు చేసే ఆనంద్ రెడ్డి కుటుంబంతో కలిసి కంచరపాలెంలో ఇంద్రానగర్ 5వ వీధిలో నివాసముంటున్నాడు. ఇతడు ఈ నెల 4వ తేదీన శుభకార్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. 5వ తేదీ రాత్రి సుమారు 12.30 గంటలకు గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఇంటి వెనుక తలుపు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ఆ సమయంలో ఇంట్లో ఆనంద్‌రెడ్డి తల్లితో పాటు కుమారుడు ధర్మాల కృష్ణకాంత్ నిద్రలో ఉన్నారు. ఆ అగంతకులు బామ్మ, మనవుడ్ని ప్లాస్టర్, ప్లాస్టిక్ ట్యాగ్ వైర్లతో కట్టేసి నిర్బంధించారు. ఆమె ఒంటిపై ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలు, మనవడి చేతికి ఉన్న డైమండ్ రింగ్, బీరువాలో ఉన్న రూ. 50 వేలు దోచుకున్నారు. తర్వాత ఇంటి ముందు పార్క్ చేసిన మహీంద్ర ఎక్స్‌యూవీ వాహనాన్ని కూడా దొంగలించి అక్కడ నుంచి పరారయ్యారు.

నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

కేసు దర్యాప్తు కోసం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ (క్రైమ్స్) లతా మాధురి ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ క్రైమ్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పర్యవేక్షణలో వెస్ట్ క్రైమ్ సీఐ మీసాల చంద్రమౌళి, ఎస్ఐ షేక్ అబ్దుల్ మరూఫ్, సీసీఎస్ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుల కోసం ఒకవైపు నగరంలో గాలిస్తూనే మరోవైపు వారి మొబైల్ డేటాలో అనుమానాస్పద యాప్‌లు, ట్రేడింగ్‌కు సంబంధించిన హిస్టరీ, ప్లాస్టర్ సెర్చ్ హిస్టరీ వంటి ఆధారాలను గుర్తించారు. దీంతో పోలీసులు నిందితుల కోసం విజయవాడ, హైదరాబాద్‌లలో గాలించారు. పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో నిందితులు తిరిగి విశాఖకు వచ్చి బంగారం, నగదు పంచుకుంటుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.1 లక్షలు, 12 తులాల బంగారు ఆభరణాలు, మహీంద్రా కారును స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.



కేసుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, చిత్రంలో నిందితులు

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అప్పులపాలు

ప్రధాన నిందితుడు కృష్ణకాంత్ తండ్రి ఆనంద్‌రెడ్డిలా వ్యాపారంలో సక్సస్ అవ్వాలని ఆన్‌లైన్ ట్రేడింగ్ చేశాడు. ఇందులో భారీగా నష్టపోయాడు. అప్పులు తీర్చేందుకు స్నేహితులు పీఎం పాలెంకు చెందిన పరపతి ప్రమోద్ కుమార్, కేఆర్‌ఎం కాలనీకి చెందిన షేక్ అభిషేక్, మధురవాడకు చెందిన అవసరాల సత్య సూర్యకుమార్‌లతో కలిసి సొంత ఇంట్లోనే దొంగతనం చేయాలని ప్రణాళిక చేశాడు. వారం రోజుల ముందు వీరు సెల్ కాన్ఫరెన్స్‌లో నేరానికి ఏం ఉపయోగించాలి.. ఎలా తప్పించుకోవాలో ప్లాన్ చేశారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలు కూడా పని చెయ్యకపోవడంతో ఆ విషయం కూడా మాట్లాడుకుని నేరం చేస్తున్న సమయంలో హిందీ తప్ప మరే భాష మాట్లాడకూడదని నిర్ణయించుకున్నారు. ఈ సమయంలో కృష్ణకాంత్ తండ్రి ఆనంద్‌రెడ్డి హైదరాబాద్‌కు వెళ్లడంతో వీరు ఈ నెల 5వ తేదీ రాత్రికి ప్లాన్ అమలు చేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న విధంగా బామ్మతో పాటు కృష్ణకాంత్‌ను కట్టేసి బంగారం, నగదు దోచుకున్నారు. అనంతరం ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న ఆనంద్‌రెడ్డి కార్‌లో పరారయ్యారు. అక్కడి నుంచి ఎన్ఏడీ, గోపాలపట్నం, ప్రహ్లాదపురం, అడవివరం, హనుమంతవాక వైపు నుంచి మారికవలస వెళ్లి అక్కడ నిర్మానుష్య ప్రాంతంలో రోడ్డు పక్కన కారు వదిలి ఆటో ద్వారా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చారు. బస్సులో ముందు విజయవాడ, అక్కడి నుంచి హైదరాబాద్ పారిపోయారు.

అన్నదాతలను ఆదుకోవడంలో విఫలం

- గోవాడ సుగర్స్ రైతుల బకాయిలు విడుదల చేయాలి
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాద్



మునగపాక: అన్నదాతలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ నిధులు కొద్ది మంది రైతులకు మంజూరు చేసి చేతులు దులుపుకొన్నారన్నారు. అనకాపల్లి బెల్లం మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేక రైతులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. గతంలో పెద్దమొత్తంలో చెరకు సాగు జరిగేదని, గిట్టుబాటు ధర లేకపోవడంతో క్రమేణా దానికి స్వస్తి పలికి, వరి సాగు చేస్తున్నారని తెలిపారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు రూ.35 కోట్ల మేర బకాయిలు చెల్లింపునకు ఇంత వరకు కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉండేదని, నేడు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతులకు అండగా రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ నేతలు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, కరణం ధర్మశ్రీలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, ఇల్లా శిరీషా నాగేశ్వరరావు, బొడ్డేడ బుజ్జి, పార్టీ నేతలు మొల్లేటి శంకర్, నరాలశెట్టి తాతారావు, శ్రీపతి రామకృష్ణ, ఆడారి రమణబాబు, బొడ్డేడ సోమరాజు, ఎంజే నాయుడు పాల్గొన్నారు.

జగనన్న పర్యటన సూపర్ సక్సెస్

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సూపర్ సక్సెస్ అయిందని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ చెప్పారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మాకవరపాలెంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు జీవో లేదంటూ చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను సవాలుగా తీసుకుని మెడికల్ కళాశాలకు వచ్చిన జగనన్నకు జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారన్నారు. పోలీసులు ఆంక్షలు విధించినా జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సూపర్ సక్సెస్ కావడంలో అందరి భాగస్వామ్యం ఉందన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య!

- 7వ తేదీ రాత్రి సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ వద్ద ఘటన
- యలమంచిలిలో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు

ఎంవీపీకాలనీ : ఇద్దరు రౌడీషీటర్ల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం ఒకరి హత్యకు దారి తీసింది. ఈ నెల 7వ తేదీ రాత్రి సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ వద్ద జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కశింకోట శ్రీధర్, గౌరీశంకర్ పాతనేరస్తులు. శ్రీధర్‌పై విజయవాడలో, గౌరీశంకర్‌పై యలమంచిలిలో రౌడీషీట్లు ఉన్నాయి. వీరు పలు నేరాల్లో నిందితులు కాగా విశాఖలోని త్రీటౌన్, పీఎం పాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో సైతం గతంలో కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో భాగంగా ఈ నెల 7వ తేదీన ఇద్దరు విశాఖ జిల్లా కోర్టుకు వాయిదాకు హాజరయ్యారు. అనంతరం కారులో నగరమంతా తిరుగుతూ మద్యం సేవించారు. 7వ తేదీ రాత్రి 2 గంటల సమయంలో (8వ తేదీ తెల్లవారి) సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ సమీపంలో ఓ మహిళ విషయమై వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది ఘర్షణకు దారి తీయడంతో గౌరీశంకర్ శ్రీధర్‌పై దాడిచేసి పలు చోట్ల కత్తితో గాయపరిచాడు. నరాలు తెగి విపరీతంగా రక్తస్రావం కావడంతో శ్రీధర్ స్పృహ కోల్పోయాడు. మద్యం మత్తులో ఉన్న గౌరీశంకర్ కారులో శ్రీధర్‌ను వేసుకొని యలమంచిలి వైపు బయలుదేరాడు.

ఉదయం 6 గంటలకు యలమంచిలి వద్ద పరిశీలించగా శ్రీధర్ మరణించినట్లు గుర్తించాడు. దీంతో కాళ్లు, చేతులు కట్టేసి యలమంచిలిలోని పోలవరం కెనాల్‌లోకి మృతదేహాన్ని విసిరేసి అక్కడి నుంచి పరారయ్యాడు. వేరే కేసులో ఈ నెల 9న పోలీసులు గౌరీశంకర్‌ను విచారిస్తున్న సయయంలో ఈ హత్యోదంతం వెలుగు చూసినట్లు ఎంవీపీ సీఐ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం పరిశీలించగా బాడీ లభ్యమైందన్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై శ్రీధర్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంవీపీ సీఐ ప్రసాద్

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఐదుగురు విద్యార్థులు



ఎంపికైన కొత్తపేట జెడ్పీ స్కూల్ విద్యార్థులు

యలమంచిలి రూరల్: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు యలమంచిలిలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్టు పీఈటీ కుందూరు రాజు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్ -17 జిల్లా స్థాయి హాకీ జట్టు క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో బంగారు సత్యనారాయణ, మోహిత్, కార్తీక్ కుమార్, బాలికల విభాగంలో ఐ సునీత, రమ్యశ్రీ ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరిని శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వైవీ రమణ, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, అమరావతి, సూర్యకళ పాల్గొన్నారు.

వెంకన్నపాలెంలో పొక్లెయిన్ దగ్ధం

మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెం శివారు వెంకన్నపాలెంలో వ్యవసాయ భూమిలో పనులకు తీసుకువెళ్లిన పొక్లెయిన్ గురువారం రాత్రి దగ్ధమైంది. రామన్నపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యాకా శంకర్రావుకు చెందిన పొక్లెయిన్‌ను వ్యవసాయ భూములను చదును చేసేందుకుగాను వెంకన్నపాలెం తీసుకువెళ్లాడు. కొద్ది రోజులుగా ఆ భూమిలోనే ఉన్న ఇది కాలిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పార్టీ మండల నేతలతో కలసి శుక్రవారం పరిశీలించారు. బాధితుడిని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది టీడీపీ మూకల పనేనని ఆరోపించారు. మరీ ఇంత నీచమైన పనులకు తెగబడటం దారుణమన్నారు. ఈ ఘటనపై బాధితుడు పార్టీ నేతలతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాజారావు, నేతలు బొడ్డు గోవిందరావు, భద్రాచలం, అయ్యప్ప, ప్రసాద్, చంటి పాల్గొన్నారు.



పొక్లెయిన్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, నేతలు

భీమవరం చెక్‌పోస్టు వద్ద డ్రోన్‌లతో నిఘా



భీమవరం చెక్‌పోస్టు వద్ద డ్రోన్‌తో నిఘా ఉన్న దృశ్యం

గొలుగొండ: గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచినట్టు గొలుగొండ ఎస్ఐ రామారావు తెలిపారు. కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధి భీమవరం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఆయన డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేశారు. చింతపల్లి, జీకేవీధి మండలాల నుంచి మైదానానికి వస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి విడిచి పెడుతున్నారు. భీమవరం చెక్‌పోస్టు పరిసర ప్రాంతాలను డ్రోన్‌లతో నిఘా పెట్టారు.

ఆలిండియా యోగా పోటీలకు ఎంపిక



నందినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

మాకవరపాలెం: ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల యోగా పోటీలకు తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఎంపికైంది. విజయనగరం జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో తగరపువలసలో నిర్వహించిన సౌత్ జోన్ యోగా పోటీల్లో సీఎస్‌సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొంచాడ నందిని ప్రతిభ చూపి ఆలిండియా పోటీలకు ఎంపికైంది. ఈమెను కళాశాల ప్రిన్సిపాల్ సి.మోహన్‌రావు శుక్రవారం అభినందించారు. నవంబర్ 24 నుంచి 28వ తేదీ వరకు బెంగళూరులో జరిగే అంతర్ విశ్వ విద్యాలయాల యోగా పోటీల్లో పాల్గొననున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పోటీల్లోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యోగా ట్రైనర్ చంద్రిక పాల్గొన్నారు.

యలమంచిలి పోలీసులు ఓవరాక్షన్ చేశారు...

- యలమంచిలి సీఐ, పట్టణ ఎస్ఐ టీడీపీ ప్రభుత్వంలోనే ఉద్యోగం చేస్తారా?
- జగన్ పర్యటనకు వెళ్లకుండా పార్టీ నాయకులకు తీవ్ర అడ్డంకులు సృష్టించారు
- ఎప్పుడూ కూటమే అధికారంలో ఉండదని గుర్తుంచుకోవాలి
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ధర్మశ్రీ ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్ : యలమంచిలి సీఐ, పట్టణ ఎస్ఐలు కేవలం టీడీపీ ప్రభుత్వంలోనే ఉద్యోగం చేద్దామనుకుంటున్నారేమో? మిగిలిన ప్రభుత్వాల్లో మైదాన ప్రాంతాల్లో పనిచేయక్కర్లేదు, శంకరగిరిమాన్యాలు చూడొచ్చని అనుకుంటున్నారేమో? వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్ జగన్ జిల్లా పర్యటన సందర్భంగా జిల్లాలో పోలీసు ఉన్నతాధికారులు మాత్రం హుందాగా వ్యవహరించారని, కానీ యలమంచిలి పట్టణ మహిళా ఎస్ఐ సావిత్రి మాత్రం గురువారం ఓవర్ యాక్షన్ చేశారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మండిపడ్డారు. శుక్రవారం సాయంత్రం యలమంచిలి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ నాయకుడిని చూడడానికి ద్విచక్రవాహనాలపై వెళ్తున్న పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డగించి అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారన్నారు. తమ నాయకుడు ఉప్పులూరి కిరణ్ కారును ఆపి తాళాలు తీసుకుని అందులో ప్రయాణిస్తున్న వారందరినీ దింపేశారన్నారు. పరిస్థితులు కలకాలం ఇలా ఉండిపోవని, ఇది తప్పని పట్టణ ఎస్ఐను గ్రహించాలన్నారు. ఎస్ఐ తీరు మార్చుకోవాలని అన్నారు. వై.ఎస్ జగన్ పర్యటనను సూపర్ సక్సెస్ చేసిన ప్రజలు, పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు ఎదుర్కొంటున్న వివిధ వర్గాల వారు తమ అధినేత దృష్టికి సమస్యలను తీసుకెళ్లారన్నారు. మునగపాక మండలంలో సుమారు 1280 మంది రైతులు రహదారి విస్తరణలో భూములు కోల్పోయారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భూ నిర్వాసితులందరికీ నష్టపరిహారంగా నగదు చెల్లించాలని నిర్ణయించామన్నారు. సాధారణ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భూములు కోల్పోయిన రైతులంతా తప్పనిసరిగా టీడీఆర్ బాండ్లు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అనేక రకాలుగా వారిపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. రాంబిల్లి ఎస్ఏఓబీ ఏర్పాటుతో ప్రభావిత గ్రామాలను గుర్తించకపోవడంతో 6 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాంబిల్లి మండలం కృష్ణంపాలెం వద్ద సెజ్ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు పునరావాసం ప్యాకేజీలో భాగంగా పంచదార్ల వద్ద ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు. ఇలాంటి ప్రధాన సమస్యలన్నింటినీ గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన తమ అధినేత దృష్టికి తీసుకొచ్చిన బాధితుల పక్షాన మద్దతుగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు కూటమి ప్రభుత్వం ఇస్తామని చెబుతున్న టీడీఆర్ బాండ్లు నాలిక గీసుకోవడానికి కూడా పనికిరావన్నారు. నియోజకవర్గంలో జనసేన నాయకులు చేస్తున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలు, రవాణా గురించి అధినేత దృష్టికి తీసుకెళ్లామన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

- 17 కేజీల గంజాయి, బైక్ స్వాధీనం



గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన నిందితులు

యలమంచిలి రూరల్: ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితుల్ని యలమంచిలి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. మండలంలోని పెదకిల్లపాలెం హైవే కూడలి వద్ద అనకాపల్లి నుంచి తుని వైపు ఒక బస్తాలో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించిన పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నారు. తమిళనాడు తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి తాలూకా ఆర్ని గ్రామానికి చెందిన నిందితులు ఆర్ సంతోష్ శివం, జే కార్తీక్ 17 కేజీల గంజాయిని తరలిస్తున్నట్టు తేలిందని యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర తెలిపారు. నిందితులు ఒడిశా ఏజెన్సీ నుంచి తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్నట్టు విచారణలో తెలిసిందన్నారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ద్విచక్రవాహనం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామన్నారు.

రైలు ఢీ కొని కూలీ మృతి

అనకాపల్లి: మండలంలోని అచ్చియ్యపేట గ్రామానికి చెందిన ఉరుకుటి శ్రీనివాసరావును ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొని శుక్రవారం అక్కడికక్కడే మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కె.టి.వి.లక్ష్మి తెలిపారు. మండలంలో ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్‌లో రైల్వే ట్రాక్‌పై పట్టాలు దాటుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. కూలీ పనులు చేసుకునే అతడికి భార్య, కుమారుడు, వివాహితులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మరొకరు...

అనకాపల్లి టౌన్: పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ ఎం వెంకటనారాయణ వివరాల ప్రకారం.. ఇక్కకడ వేల్పులవీధికి చెందిన ఇంజరపు వెంకట్రావు(55) శారదా నది బ్రిడ్జి వైపున నెహ్రూచౌక్ జంక్షన్ దాటుతుండగా, చోడవరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. దీంతో మృతుడిపై బస్సు చక్రం ఎక్కడంతో తల నుజ్జునుజ్జయింది. అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

రక్షణ లేని బాలికల హాస్టల్



హాస్టల్ ప్రహరీ తక్కువ ఎత్తులో ఉండడంతో గ్రీన్ మ్యాట్‌తో కప్పిన దృశ్యం



పిచ్చికుక్క దాడిలో గాయపడిన విద్యార్థినులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

- మూడడుగుల ప్రహరీతో అవస్థలు
- పిచ్చికుక్క కరిచి 12మంది విద్యార్థినులకు గాయాలు

రావికమతం: స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో రక్షణ కొరవడింది. ప్రహరీ తక్కువ ఎత్తులో ఉండడంతో గురువారం వేకువజామున పిచ్చికుక్క హాస్టల్‌లోకి ప్రవేశించి విద్యార్థినులను గాయపరిచింది. ఇక్కడ కొత్తగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ఇందు కోసం ప్రహరీలో కొంత భాగం పడగొట్టారు. కేవలం మూడడుగుల ఎత్తులో ఉన్న గోడకు గ్రీన్ మ్యాట్ కట్టి ఉంచారు. దీంతో పిచ్చి కుక్క హాస్టల్‌లో చొరబడి విద్యార్థినులను గాయపర్చింది. గురువారం తెల్లవారుజామున ముగ్గురు విద్యార్థినులు కాలకృత్యాల కోసం బాత్‌రూముకు వెళ్లేందుకు బయటికి రాగా అదే సమయంలో గ్రీన్ మ్యాట్‌ను చీల్చుకుంటూ పిచ్చికుక్క దాడి చేసింది. వారు కేకలు వేయడంతో తోటి విద్యార్థినులు బయటకు రాగా వారిపైనా దాడి చేసింది. ఇలా 12 మంది గాయపడ్డారు. వారిని వార్డెన్ లలితా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఈ విషయం తెలిసిన బాలికల తల్లిదండ్రులు ఆస్పత్రికి పరుగులు తీశారు.

డీఎంహెచ్‌వో పరామర్శ

గాయపడిన విద్యార్థినులను డీఎంహెచ్‌వో హైమావతి శుక్రవారం పరామర్శించారు. ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలపై ఆరా తీశారు. మంచి వైద్యం అందించాలని రావికమతం పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి తెలిపారు. రేబిస్, స్నేక్ వెనం టీకాలు ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

పిచ్చికుక్క దాడి.. ఇద్దరికి గాయాలు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో శుక్రవారం సాయంత్రం ఇద్దరిని పిచ్చికుక్క కరిచింది. గ్రామానికి చెందిన కళ్ల వెంకట్రావు(46) ముత్యాలమ్మ గుడి వద్ద గ్యాస్ డెలివరీ చేసి వస్తుండగా, వెనుక నుంచి వచ్చి కుడికాలు మీద కరిచి గాయపర్చింది. మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి ప్రథమ చికిత్స పొందాడు. రాపేట పార్దు(11)ను కరిచి గాయపర్చగా స్థానిక పీహెచ్‌సీలో పొందాడు.

క్లుప్తంగా

నేడు గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం

అనకాపల్లి: స్థానిక కుంచావారివీధిలో గౌరీపరమేశ్వరుల విగ్రహ నిలుపు మహోత్సవం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి కుంచా చిన్ని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారిని పట్టణ పురవీధుల్లో ఊరేగించి, అనంతరం ఆలయంలో నిలుపుదల చేస్తామన్నారు. డిసెంబర్‌లో అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు.

కనకదుర్గమ్మ కొండపై అన్నదానం


కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

అనకాపల్లి: మండలంలో సత్యనారాయణపురంలో కనకదుర్గమ్మ కొండపై శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఇక్కడ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోటిపల్లి కిషోర్, ఆలయ ధర్మకర్త బోయిన రమణాజీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధాకర్

అనకాపల్లి టౌన్: మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ యోజన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పలువురికి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో భాగంగా పలువురు గర్భిణులకు రిజిస్ట్రేషన్ చేసి మాతా శిశువు సంరక్షణ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈవో బి. మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి: వీవోఏల సమస్యలను పరిష్కరించాలని ఏపీ వెలుగు విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.రూపాదేవి, ఎస్.వెంకటలక్ష్మి కోరారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడారు. జిల్లాలో 1,292 మంది వీవోఏలు, 39,579 మంది స్వయం సహాయక సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్నారని తెలిపారు. 20 సంవత్సరాలుగా ప్రభుత్వాల ద్వారా ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీవోఏలకు ఇస్తున్న గౌరవ వేతనాలను ప్రతి నెలా 5వ తేదీలోపు ఇవ్వాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా వేతనాన్ని పెంచాలన్నారు. గ్రూపు ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 158 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,600	5,250
రెండో రకం	4,000	4,240
మూడో రకం	3,900	3,970

అనకాపల్లి సినిమాలు

రాజా	: ఇడ్లీ కొట్టు (ఉదయం, మధ్యాహ్నం)
రాజా	: శశివర్ధన్ (ఫస్ట్, సెకండ్‌షో)
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: టీఆర్ఓఎన్ ఏఆర్ఈఎస్(తెలుగులో)
పర్తిసాయి	: ఓజీ
షిర్డిసాయి	: అరి
వెంకటేశ్వర	: కానిస్టేబుల్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 87 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-20, బీ పాజిటివ్-27, ఓ పాజిటివ్-33, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 334 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

ముంపులో కాలనీలు

- వారం రోజులుగా వర్షపు నీటిలోనే..
- మోకాల్లోతు నీటిలో గృహాలు
- సాయినగర్, ఎన్జీవోస్ కాలనీవాసులకు ఇక్కట్లు
- ఇళ్లను ఖాళీ చేస్తున్న నివాసితులు
- కనీసం పట్టించుకోని కొత్తూరు పంచాయతీ అధికారులు


రోడ్డుపై మూడడుగుల లోతు గోతులోంచి వస్తున్న ఆటో

తుమ్మపాల: చెరువును కబ్జా చేస్తూ అనధికార నిర్మాణాలకు కేరాఫ్‌గా మారిన కొత్తూరు గ్రామం ఇప్పుడు వర్షపునీటితో ముంపు అంచుల్లో కొట్టుమిట్టాడుతోంది. అనకాపల్లి పట్టణానికి ఆనుకున్న ఈ గ్రామం దాదాపు పట్టణంలో కలిసిపోయింది. దాంతో అక్రమార్కులు ఇక్కడ ప్రభుత్వ భూములు, సగానికి పైగా చెరువులో అక్రమ నిర్మాణాలతో నింపేశారు. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అధికార యాంత్రాంగం తామేమైనా తక్కువా అంటూ చెరువు గర్భాన్ని ఎత్తు చేసి ఆర్డీవో కార్యాలయంతో పాటు సచివాలయం, రైతు భరోసా కేంద్రం, పలు భవనాలు నిర్మించి ఆక్రమణదారులతో పోటీపడటంతో ఇప్పుడు కొత్తూరులో సాయినగర్ పూర్తిగా ముంపుబారిన పడింది. రోడ్లపై నీరు చేరి ఇళ్లలోకి చేరడంతో అక్కడివారరంతా వర్ణనాతీతమైన ఇబ్బందులు పడుతున్నారు.

వారం రోజులుగా నీటిలోనే రాకపోకలు...

ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు సాయినగర్, ఎన్జీవోస్ కాలనీ, రంగా మెడికల్ స్టోర్ ఏరియాల్లో ఇళ్లలోకి నీరు చేరి మోకాల్లోతు నీటిలోనే సావాసం చేయాల్సి వచ్చిందని పలువురు చెబుతున్నారు. ఇంట బయట నీటిలోనే రాకపోకలు చేయలేక మేడపైనే ఉండాల్సి వస్తుందని, పంచాయతీ, రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పాములు కూడా ఇళ్లలోకి చేరడంతో తీవ్రంగా భయాందోళనలకు గురవుతున్నామని, రాత్రిళ్లు ఇళ్లలో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. సాయినగర్‌లో పదికిపైగా ఇళ్లలో నీరు చేరడంతో ఇళ్లను ఖాళీ చేసి పలువురు మరో చోటకు వెళ్లిపోతున్నారు.

పట్టించుకోని పంచాయతీ, రెవెన్యూ అధికారులు

గ్రామంలో పంచాయతీ కార్యాలయానికి ఎదురుగానే అనేక ఇళ్లలోకి నీరు చేరడం, రోడ్డు మీదనే నీరు నిలిచిపోయినా అధికారులు కనీసం దృష్టి సారించడం లేదు. గ్రామంలో నిలిచిపోయిన నీటిని బయటకు తరలించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టే స్థితిలో రెవెన్యూ అధికారులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. బహుళ అంతస్తులు, భారీ భవనాలు ఉన్నప్పటికి సరైన పారిశుధ్య నిర్వహణలో పంచాయతీ పారిశుధ్య విభాగం విఫలమవడంతో వచ్చిన దుస్థితిని చూసి పలువురు నవ్వేరపోతున్నారు.


పాఠశాల నుంచి మురుగునీటిలో నడుచుకుంటూ వస్తున్న చిన్నారులు

బయటకు వెళ్లలేని స్థితిలో ఉన్నాం



కింద ఇంటిలోకి నీరు చేరడంతోపాటు రోడ్డుపైనా మూడడుగులు ఎత్తున మురుగు, వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో బయటకు రాలేని స్థితిలో ఉన్నాం. 20 ఏళ్లుగా ఉంటున్న మాకు ఎప్పుడు ఇలాంటి దుస్థితి రాలేదు. ఇప్పుడు కుటుంబమంతా చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇంటిలో నుంచి బయటకు వెళ్లలేని స్థితిలో ఉన్నాం. స్కూల్‌కు తీసుకెళ్లి తీసుకురావడం కూడా కష్టంగా ఉండటంతో మరోచోట బంధువుల ఇళ్లకు మనవళ్లను పంపించాల్సి వచ్చింది. నాలుగు రోజులుగా అధికారులకు సమాచారం ఇస్తున్నా కనీసం పరిశీలన కూడా చేయలేదు.

– కాళ్ల సన్యాసమ్మ, గృహిణి, సాయినగర్, కొత్తూరు గ్రామం

కాలనీలో నీరు నిలిచిపోతుంది



చెరువు నిండిపోవడంతో సాయినగర్ కాలనీలో తరచూ నీరు నిలిచిపోతుంది. దీంతో పాటు సాయినగర్‌లో మురుగునీటి కాలువలు లేకపోవడం, భవనాలు పెరిగిపోవడంతో నీరు బయటకు పోయేదారి లేకుండా చేసారు. గత ఏడాది రోడ్డుపై మాత్రమే ఉండే నీరు ఈ ఏడాది ఇళ్లలోకి కూడా చేరి రోజుల తరబడి నిలిచిపోయింది. ఇంటిలో సామాగ్రిని మరనోచోటకు తరలించి ఖాళీ చేయాల్సి వస్తుంది. బయట కూడా నీటిలోనే రాకపోకలు చేయాల్సి వస్తుంది. బోర్లలో కూడా మురుగునీరు చేరడంతో చెడు వాసనతో నీరు వస్తుంది. డబ్బాలతో నీటిని కొనుగోలు చేసి త్రాగుతున్నాము.

– ఉండ్ల లక్ష్మికాంతం, గృహిణీ, సాయినగర్, కొత్తూరు గ్రామం


సాయినగర్‌లో ఇళ్లలో చేరిన నీరు


కొత్తూరు ప్రధాన రహదారిపై నిలిచిపోయిన నీరు


సాయినగర్ రోడ్డులో చేరిన నీరు

రబీలో అధిక దిగుబడులు, ఆదాయం

- రబీ విత్తన దినోత్సవంలో ప్రధాన శాస్త్రవేత్త జగన్నాథరావు


అభ్యుదయ రైతును శాలువాతో సత్కరిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త జగన్నాథరావు

అనకాపల్లి: రబీ సీజన్‌లో అనుకూలమైన వాతావరణం, ఎక్కువ సూర్యరశ్మి అందుబాటులో ఉండటం వల్ల అధిక దిగుబడులు, ఆదాయాన్ని రైతులు పొందవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో రబీ సీడ్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా అక్టోబర్‌లో సీడ్ డే వేడుకలు నిర్వహిస్తామన్నారు. రబీ పంటల్లో నాణ్యమైన విత్తనాలు ఉపయోగించడం రైతులకు లాభదాయకమన్నారు. యాజమాన్య పద్ధతులు జీవ ఎరువుల వినియోగం, జీవ నియంత్రణ పద్ధతులు ఉపయోగించుట, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి వివరించారు. అనంతరం రబీ విత్తన దినోత్సవం సందర్భంగా విత్తన ఉత్పత్తి రైతును, ప్రగతిశీల రైతును శాస్త్రవేత్తలు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మూడు మండలలాలకు చెందిన 30 మంది రైతులు, 18 మంది ఆర్ఏడబ్ల్యూపీ విద్యార్థులు, ప్రధాన శాస్త్రవేత్తలు పి.వి.కె.జగన్నాథరావు, పి.వి.రమణమూర్తి, డి.ఉమామహేశ్వరరావు, గౌరీ, సరిత తదితరులు పాల్గొన్నారు.

సిటీ బస్సు పాస్‌లు అనుమతించాలి


అధికారి ప్రవీణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి: గ్రేటర్ విశాఖ పరిధిలో ఉన్న అనకాపల్లి వరకు సిటీ బస్సు పాస్‌లకు అనుమతి ఇవ్వాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రజా రవాణా శాఖ జిల్లా అధికారి వి.ప్రవీణకు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి వరకూ సిటీ బస్సు పాస్‌లకు అనుమతించాలన్నారు. సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి వర్షపునీరు రావడం వల్ల దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆళ్ల ప్రవీణ్‌కుమర్, బొడ్డు సోమరాజు, ఆడారి బుచ్చిరాము, బొబ్బిలి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు అండగా ప్రజలు

అనకాపల్లి: కూటమి ఏడాది పాలనకే విరక్తి చెందిన ప్రజలు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలబడుతున్నారని, దాన్ని ఓర్వలేక ఆయన సభలు, సమావేశాలకు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సూరిశెట్టి రమణఅప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో 17 మెడికల్ కళాశాలలకు భూమిపూజ చేసి ఏడింటిని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. దీన్ని మరచి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం నియోజకవర్గంలో ఎక్కడ మెడికల్ కళాశాల నిర్మించారో చూపించాలని ఎద్దేవా చేశారన్నారు. దాంతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పరిశీలనకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వస్తే కూటమి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయన్నారు. ఈ భయంతో ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టించినా ప్రజలు ప్రత్యామ్నాయ మార్గంలో తండోపతండాలుగా వచ్చారన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులు వైద్య విద్య చదువుకోవాలని 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో దశలు వారీగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి


సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ రాజు

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి కష్టపడి చదువుకోవడం కంటే ఇష్టపడి చదవడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వరంగల్ ఎన్ఐటీ అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ యు.ఎస్.ఎన్.రాజు తెలిపారు. స్థానిక గవరపాలెం గుడ్ షెపర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శుక్రవారం విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు, సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వారిలో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎ.పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభల విజయవంతానికి పిలుపు


రాష్ట్ర మహాసభ జెండాను ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో అనంతపురంలో ఈ నెల 16న జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పిలుపునిచ్చారు. స్థానిక టిడ్కో కాలనీలో శుక్రవారం నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న దాడుల్ని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలకు నైట్ షిఫ్టులు వేయడం సరికాదన్నారు. 13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీ మేరకు 18 ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జాయింట్ సెక్రటరీ తుంపాల అన్నపూర్ణ, మండల అధ్యక్షురాలు మన్యాల బంగారమ్మ, అరుణ, వరలక్ష్మి, బేగం, లక్ష్మి, అనసూయ, కృపా, గోపాలరావు, శంకర్రావు పాల్గొన్నారు.

ప్రజలందరికీ జీఎస్టీ ఫలాలు


మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి


జీఎస్టీ ఇంగ్లీషు అక్షరాల రూపంలో విద్యార్థులు

అనకాపల్లి టౌన్: జీఎస్టీ ఫలాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి పేర్కొన్నారు. స్థానిక గవరపాలెం గర్ల్స్ హైస్కూల్‌లో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గృహోపకరణాల నుంచి, అత్యవసరమైన మందులపైనా జీఎస్టీ తగ్గిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులందరూ తల్లిదండ్రులకు తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా జీఎస్టీ అనే ఇంగ్లిషు అక్షరాల రూపంలో విద్యార్థులు ప్రదర్శించిన ఆకృతి చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో జీవీఎంసీ యూడీసీ సంతోష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటరావు మృతి పార్టీకి తీరనిలోటు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యింజరపు వెంకటరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం శోచనీయమని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తెలిపారు. భరత్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ఎనలేని సేవలందించిన వెంకటరావు మృతి పార్టీకి తీరని లోటన్నారు.

పీహెచ్‌సీలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి

కశింకోట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుందని వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి విమర్శించారు. శుక్రవారం ఇక్కడ సర్పంచ్ మంత్రి జయరజనితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ వైద్యుల సమ్మె వల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు పడకేశాయన్నారు. ప్రజలకు వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా వైద్యులను నియమించినా, అరకొర సేవలు తప్ప పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. దీనివల్ల ప్రధానంగా గర్భిణులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు పోయడానికి అవకాశం లేక అనకాపల్లి ఆస్పత్రికి అనేక ప్రయాసలు కోర్చి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని దృష్ట్యా తక్షణమే వైద్యుల న్యాయమైన కోరికలను పరిష్కరించి పీహెచ్‌సీలతో వైద్య సేవలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలన్నారు. లేదంటే వైఎస్సార్‌సీపీ తరపున వారికి మద్దతుగా నిలిచి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సీనియర్ నాయకుడు పెంటకోట శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మంత్రి పీటర్ వైస్‌మాన్ పాల్గొన్నారు.

మహిళా స్వయం సమృద్ధికి శిక్షణ

సబ్బవరం: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను శుక్రవారం నిర్వహించారు. హర్టర్ఫుక్ ఎంపవర్‌మెంట్ సొల్యూషన్స్ ప్రై.లి. ఆధ్వర్యంలో డీబీఎస్ ఫౌండేషన్ సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొని ప్రోగ్రాం ఉద్దేశాలను వివరించారు. మహిళలు వ్యాపార అవగాహన పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో వ్యాపారం ప్రారంభించేందుకు రిజిస్ట్రేషన్, ఫుడ్ సర్టిఫికెట్ పొందడం, ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, వ్యాపార నియమావళి తదితర అంశాలను హర్టర్ఫుక్ కోఆర్డినేటర్ వి.నాగరాజు, ట్రైనర్ శ్రీవిద్య వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు


చెకుముకి సంబరాల పోస్టరు అవిష్కరిస్తున్న త్రిమూర్తులరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది

రోలుగుంట: రాష్ట్రవ్యాపితంగా ఈ నెల 18 వ తేదీ నుంచి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరరాలు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఆ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.త్రిమూర్తులరెడ్డి శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం. శేషగిరిరావు, ఉపాధ్యాయ సిబ్బందితో కలసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంబరాల్లో రాష్ట్రస్థాయిలో 4 లక్షల 50 వేల మంది విద్యార్థులు పాల్గొనున్నట్టు తెలిపారు. 18న పాఠశాల స్థాయిలోను, నవంబర్ 1 న మండలస్థాయిలోను, అదే నెల 23న జిల్లా స్థాయిలోను, డిసెంబర్ 12 ,13,14 తేదీల్లో రాష్ట్రస్థాయిలో జరుగుతాయని, విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని విలేకరులకు తెలిపారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్యామల, సిబ్బంది

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు తానాం గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వై.ఎస్.సుహాసిని శుక్రవారం తెలిపారు. గోపాలపట్నంలో గురువారం నిర్వహించిన పోటీల్లో డి.దివ్యశ్రీ, వి.రమ్య, ఎం.రోషిణి ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఏలూరు దరి పెదవేగిలో జరగనున్న వివిధ అథ్లెటిక్స్ పోటీలకు పాఠశాల విద్యార్థులు ఎస్.మీకా, జి.రూప, బి.మౌనిక, బి.కావ్య, కె.తేజశ్రీ, కె.శ్రీలక్ష్మి, టి.ఝాన్సీ, ఎస్.శ్రావణిలు ఎంపికై నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని అభిలషించారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ ఎస్.గౌరీ, చంద్రకళ పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు.. వీధిన పడిన వ్యాపారులు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి వినాయక ఆలయం సమీపంలోని ప్రభుత్వ స్థలంలోని దుకాణాలను మున్సిపల్ అధికారులు యంత్రాలతో శుక్రవారం తొలగించారు. దుకాణాల్లోని సామాగ్రిని మున్సిపల్ సిబ్బంది బయటపడేసారు. గడువు ఇవ్వాలని చిరువ్యాపారులు మున్సిపల్ అధికారులను బతిమిలాడినా వదలేదు. రేకుల షెడ్లను పొక్లెయిన్‌తో తొలగించారు. మాంసం, ఫ్యాన్సీ దుకాణాలు నడుపుతున్న వ్యాపారులు వీధిన పడ్డారు. నలభై ఏళ్లుగా దుకాణాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని వారు వాపోయారు. మూడు తరాల నుంచి ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, ఎనాడూ మమ్మల్ని ఎవరూ ఇబ్బంది పెట్టలేదన్నారు. మున్సిపాలిటీకి ప్రతి ఏటా లైసెన్స్ ఫీజు చెల్లించడమే కాకుండా రోజువారి ఆశీలు కడుతున్నామన్నారు. ఊరులో జరిగే ప్రతి పండగకు రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకు చందా రూపంలో ఇస్తున్నామన్నారు. మాకు రాజకీయాలతో సంబంధం లేదని, అయినప్పటికీ నాయకులు తమపై కక్ష కట్టి దుకాణాలను తొలగించారని బాధితులు ఆరోపించారు. కనీసం ముందస్తు నోటీసు కూడా ఇవ్వకుండా అధికారులు ఏక పక్షంగా వ్యవహరించారన్నారు. దుకాణాల తొలగింపుతో తమ కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.